దత్త

శతావధాని వేలూరి శివరామ శాస్త్రి గారు

లోకమున అన్నము లేకపోవుచో ఒకి లోపమని ఒప్పుకొందును వస్త్రము లేక పోవుచో ఒకలోపమని అంగీకరింతును ధనము లేకపోవుచో ఒకలోపమని సమ్మతమే. మగఁడు లేకపోవుటకూడ ఒకలోపమని ఇయ్యకొందును గాని పిల్లలు లేకపోవుట ఒకలోపమా? మేనక పిల్లలు లేకపోవుట ఒకలోపముగా భావించు కొనును. ఇంతియకాక పైఁగా గునుపు. ఎవరి మీఁద ఈగునుపు?

ఇది నిక్కముగా లోపమేనా? అని ఎన్నాళ్లు ఆలోచించినను నాకు తెగలేదు. పిల్లలులేకపోవుట ఒక లోపమా? అనియు పిల్లలు కలుగుట ఒకలోపపూరణమా? అనియు నేను తరిచి తరిచి అడుగుచో మేనక రెండు కనులతోను చూచి ఊరకుండెడిది. ఈ విష యమును 'ఇంకా' వారినీవీరినీ అడుగవలెనని నాకు ఉండెడిది

'బ్రహ్మానందం' నాకెంత స్నేహితుఁడో అతనిభార్య వెంకమ్మకూడ నాకు అంత స్నేహి తురాలు. ఆమె చదువుకొన్నది. అందుచే ఆమెను 'వెంకయ్య' అని ఁడువా రందఱు లోలోపల అనుకొందురు. ఆమెను' వెంకయ్య' అని పిలుచువారిలోఁగల ఉత్తమగుణాలు వెం కమ్మకడ లేవు. పురుషులు రాఁగానే లేచి జనానాలోకి పరుగెత్తి తొంగితొంగి చూడదు. ఆమె నిర్భయముగాచూచును. నిర్భయముగా మాటాడును. ఆమె లోపల లొటారము పైకి బొటారము కాదు. లోపల ఎంతో బయటికిని అంతే. బయటికి ఎంతో లోపలా అంతే.

ఒకనాఁడు నేను అడిగినాను—'వేం! పిల్లలులేకపోవుట కూడ ఒకలోప మని అని పించునా? అనిపించె నేని అది యెటువంటి లోపము?' అని

వేం అన్నది—'ఈకూడ' స్త్రీజాతీ-జాతికీ మానభంగము. నిజముగా నీమీఁద 'డిఫర్ మేషన్'చార్జి తీసికొనిరావచ్చును.మగవాండ్రే జడ్జీలుగా ఉన్న ఈకోర్టులలో న్యాయము కలు గుట కష్టము కాఁబట్టి ఆమాట అటులుండనీ! నేను ఒకసంగతి అడిగెదను. దానికి సమాధా నము చెప్పు. భార్య లేకపోవుట పురుషునికి లోపమేనా?'

'ఈసంగతి నాకు బొత్తుగా అచుంబి తము. నాకు పదవయేట పెండ్లి చేసిరి. నాకు పదియేనవయేటనే మేనకను పంపిరి. లోఁగడ నాకు అది లోపమని తెలియదు.' అని నేను లోలోపల తలపోయుచు రెండు గ్రుడ్లు అప్ప గించి కూర్చున్నాను.

'ఏమిటీ మాటలాడవు? అవును. నీకు ఆలోపము తెలియదు. నీవు ఆఁడుదానవై ఉన్న పుడు నిన్ను మగవానిని చేసిరి. సరి కాని

మావారి నడుగుచో 'తూచా'లతో తెలియును. మావారికి ముప్పదియేండ్లు వచ్చిన దనుక వివాహము కాలేదు. ఆయనకుఁ గల మూఁడువేల రుపాయల ఆస్తీని అమ్మి తుదకు నన్ను చేసికొన్నారు. ఇది నేను చెప్పుచో లెస్స కాదు. వారిముఖమున వినవలయును. సరి. అప్పటినుండియే నన్ను తనయింటికి పంపమని మానాయనకు జాబులు. ఎందుల కా వ్రాఁత? ఇఁక నేను పెద్దదాన నైనతరువాతి సంగతి ఆయనయే చెప్పవలయును. 'ఇటులు వెంకమ్మ అనుచుండఁగా బ్రహ్మానందం ముసిముసినవ్వులతో గదిలోనుండి వీథిలోనికి ఒక లేఅంగ పెట్టినాఁడు. వెంకమ్మ వెంటనే—'మీాసంగతియే. ఇటు దయచేయుఁడు 'ఇటు దయచేయుఁడు' అని అనుచుండఁగనే అతఁడు అంతర్ధానము చేసెను. 'ఆయన ఆదారినే కోర్టుకు పోఁయి ఆఁడువారిమీాఁద డిఫమేషన్ తెచ్చునటులున్నారు. జడ్జీలు మీాపక్షీయులేగా' అన్నది వేం.

నాకును కష్టముగానే ఉన్నది. ఇపుడు బ్రహ్మానందంమీాఁద నాకు సానుభూతి కలిగినది. నేను బ్రహ్మానందమును తీసికొని వత్తునని మిషపెట్టి వెళ్లిపోవుదు ననుకొంటినిగాని వెంటనే వేం—'పర్వతాలూ! పిల్లలు లేకపోవుట లోపమా? అను ఈప్రశ్న—అది లోపమగుచో ఎటువంటి లోపము? అను ఈప్రశ్న—నన్నడుగుటకు వచ్చితివి! ఆఁగు ఆఁగు! అక్కడనే ఉండు!' అనుచు లోపలికివెళ్లి (అప్పుడే దొడ్డిదారిని అక్కడికి మేనక వచ్చినదేమో అనుకొన్నాను) మేనక చేయిపట్టుకొని నాయెదుటికి తీసికొనివచ్చి 'ఇదిగో ఈమె నడుగు!' అని అన్నది.

మేనక నాప్రశ్నకు కన్నులతో నిరీక్షించుచున్నది. దీనివలన ఇపుడే వచ్చినదనుట విస్పష్టమయినది. నాకు కొంచెము ధైర్యమువచ్చినది. పిల్లలు లేకపోవుట లోపమే కాబోఁలునని నేననుకొని లోఁగడనే తెలిసికొనకపోవుట, విశేషించి నాయంత నేను దెలిసికొనక పోవుట ఇవి యన్నియు నాలోపముగానే భావించి, వేం నామీాఁది ఉత్తరీయమును లాఁగికొనుచున్నను బయటఁబడి ఇంటికిఁ జేరి ఎంత వేగముగా వచ్చితినో గుండియలవలన ఎఱిఁగి కొంటిని. వేం తప్పక మేనకకు మాసంభాషణము చెప్పునని నిర్ధారించుకొంటిని. గది తలుపు బిగించుకొని ఆలోచించి ఇటులు రూఢిపఱచి కొంటిని—'పిల్లలఁగనువారికి - వారికే తెలియవలయును గాని మగవారికి మా కెటులు తెలియఁగలదు?' అని. ఇటులు నిశ్చయించుకొని నా యీానిశ్చయమును మేనకకు ఎఱుఁగనటులు వినిపించుచో చాల ఓదార్పుగా ఉండుననుకొని ఒకటి రెండు సారులు నాలో నేనే లోపల అనుకొన్నటులూ, బయటికి అనుకొన్నటులూ అనుకొన్నాను. మేనక వెంటనే ప్రత్యుత్తరముగా (అంతయు సరిగా నావలెనే) ఇటులు అనుకొన్నది.—'భగవంతుఁడు గర్భధారణము మగవారి మెడకే కట్టినచో అపుడు వారికే లెస్సగా తెలిసిరాఁగలదు'అని. 'స్త్రీజాతికోపము శాపముగా మాఱునేమోరా, భగవంతుఁడా' అని అనుకొ

న్నాను. ఈమాటతో ఇఁక దత్తు చేసికొన నిర్ణయించుకొన్నాను. పిల్లవానిని దత్తుచేసి కొందమని నేను; పిల్లదానిని చేసుకొంద మని మేనక.

కుఱ్ఱని పెంచుకొనుచో వార్ధకమున అక్కఱవచ్చుట ఒకటి; చచ్చిన పయి తద్దినములు పెట్టుట రెండు; ప్రకృతము సున్నను ఒకటి చేయుట మూఁడు. ఈ మొదలుగా పురుష దత్తతనుగుఱించి ఉపన్యసించుచుండువాఁడను.

వార్ధకమున వాకిటికి లాఁగుట ఒకటి; పిదప ఏబ్రస్తికోపోయి కొన్నాళ్లకు తిరిగివచ్చి అక్కడ తద్దినము పెట్టితినని అపలపించుట రెండు; ఈరీతిగా ప్రకృత లోపమును ద్విగుణీకృతముచేయుట మూఁడు. అని దేనికికి దానిని ఖండించి, ధనాశచే అల్లుఁడు హమేషా 'అక్రీత దాసుఁడు' అను తన పేరును సార్థకపఱిచి కొనుట ఒకటి; కూఁతుతో అల్లుఁడు కలిసి ఒకరికిద్దఱు అక్కఱకువచ్చుట రెండు; కొడుకు గోడంద్రు ఎంతవిరోధింతురో అల్లుఁగూఁతులు అంతప్రేమించుట మూఁడు, అని ఈ మొదలుగా స్త్రీదత్తతను గుఱించి మేనక ఉపన్యసించెడిది. ఇటులు ఎన్నాళ్లకును మా తగవు తెగలేదు.

నాకెపుడును వేదాంతములు చదివికొనుట, పత్రికలకు వేదాంతోపన్యాసములువ్రాయుటయు పని. అష్ట దిగ్బంధనములతో, అంగరక్షతో సతతము నాగదిలో కూర్చుండువాఁడను. ఆయింటి నిశ్శబ్దతను ఎలుకలు మాత్రమే అపుడపుడు భగ్నము చేయుచుండెడివి. Rat-killer వల్ల వాటిపీడయు ఇపుడంతగా కానరాదు.

ఇటులు గుహాగంభీరమైన మాగృహము ఇపుడు క్రమక్రమముగా సహస్రకంఠములతో ముఖరితము కాఁజొచ్చినది. ఇంటఁగల ప్రతి పదార్థమును క్రిందనో మీఁదనో పడి ఆధ్వనితో శ్రుతి కలుపుచున్నది.

ఇదివఱ కెన్నఁడును లేని ఈవిషయము నాకు చోద్యముగా నున్నది. చాల కాలము నుండియు మాటాపలుకూ లేని ఆ శూన్యారణ్యము అంత రణగుణధ్వనిని వడ్డితోకూడ టకాయించి అప్పు తీర్చుకొనుచున్నటులున్నది.

మెల్లగా మెల్లగా నడిచి వెళ్లి నాగది తలుపు తీసి చూచితిని. మేనక ఒడిలో దుర్గ



"దుర్గా! భయములేదు; అన్నము తిన్నావా!"

కు స్తీలు పట్టుచున్నది. నన్ను చూచి మెఱుపు తగిలినటులు ఒక్కసారి ముణుచుకొని పోయి నది. మఱి మాటాడలేదు. అంత శాంతి మా యింట అదివఱ కెన్నఁడును అనుభూతము కాలేదు. దుర్గ బిడియపడుట కాదుకాని భయ పడిన దనవలయును. శుష్కవేదాంతపఠనము వలన కలిగిన నాయుదాసీనత అంతయు అపు డాపసిపిల్లవల్ల మట్టిలో కలిసిపోయినది. 'దుర్గా! భయములేదు, అన్నము తిన్నావా?' అని నే ననఁగా దుర్గ మూసికొన్న చేతులవ్రేళ్లను ఎడముచేసి కాటుక కన్నులతో నన్ను చూచినది.

దుర్గ ఈనాఁడు ఈరీతిగా వ్రేళ్లసందుల నుండి దోబూచులాడినపిదప నేఁటి కిది ప్రథమ పాఠమనుకొని నేను మఱల తలుపు మూసి కొంటిని. మూసికొనిన వెంటనె కందిరీఁగల పట్టు కదిలినది. 'పిన్నీ! ఆయన యెవరు? ఆయన నీ కేమౌతాఁడు?' అని ప్రశ్నించి మేనక నవ్వఁ గనే 'మా అమ్మకు మానాన్న ఔతాఁడా?' అని ఈ మొదలుగా ప్రశ్న పరంపరను శరపరంపర గా పరఁగించినది.

నాకు పిల్లలనినచో ఇష్టము బహు-ఇష్టమే కాని నాకే పిల్ల లుండుట అనునది అనిష్టము మహా-అనిష్టము. ఒకవేళ నాకే ఉండుచో ఈచెప్పఁబోవు నియమములతో ఉం డుచో వారిని ఉంచుకొనుటలో ఏమియు ఆతం కము లేదు. ఏడువఁగూడదు. లోలోపలఁగూడ ఏడ్వఁగూడదు. అట్లని ముసలి మోములతో కూర్చుండరాదు. కలకలలాడుచు నవ్వుచుండ వలయును. ఎత్తుకొమ్మని యేడువఁ గూడదు. ఒకవేళ యెత్తుకొని వెంటనే దింపినచో దిగక చంకనంటుకొని లబలబలాడరాదు. వెంటనే హాసన్ముఖముతో దిగిపోవలయును. పప్పులు పెట్టుమని, బిళ్లలుపెట్టుమని వేధింపరాదు. శరీర ధారణకుమాత్రమే ఆహారమని తెలిసికొన వలెను. పెట్టినది గుటుక్కున మ్రింగి గప్‌చిప్ మని నోరు మూసికొనవలెను. వారి ముక్కు నోరు మొదలగునవి నిత్య నిర్మలములుగా ఏ శుద్ధియు నక్కఱలేక యుండవలయును. నా కోరికి చొప్పున వారికి నిద్ర రావలయును. ఆఁకలి కావలయును. నా కాగితములు చింప రాదు. వానిమీఁద వ్రాయరాదు. సిరాపోయ రాదు. విశేషించి మా యింటి నిశ్శబ్దతను బహుభద్రముగా కాపాడవలయును. ఇట్టి వింకను చెప్పకయే తెలిసికొనఁదగినవి చాల ఉన్నవి.

అన్నము తినువేళ పిల్లలు ఏడ్చుచో అది నాకు జీర్ణము కాదు. నా సంగతి తెలిసిన తల్లులు వారిని చాటులకు తీసికొనివెళ్లి నోరు మూసి వినఁబడని దెబ్బలు కొట్టుచో తొడ పాసెము పెట్టుచో, నేను మెలకువగా తెలిసి కొని—'తల్లులు చక్కగా కంటారుకాని మళ్లీ వాళ్లె చంపేస్తారు' అని అనువాఁడను.

నాయుద్దేశమున పిల్లలు ఏడువకుండ ఉండవలయుననున దొకటి. వారికి మాటలు రావు కావున తమ ఆఁకలి దప్పులు తెలుపు కొనుటకు 'ఏడుపు కావలయును' అనుఅంశము

శుష్క వేదాంతపఠనము మానిన పిదప నిన్న మొన్ననే తెలిసినది. అల్లరిమానవలయుననునది ఇంకొకటి. “మనస్సు గాలివలె పట్టరానిది. దానిని నిగ్రహింపవలెను. అని మాటి మాటికి చెప్పు గీతావాక్యములు పిల్లలనుగుఱించిన వే” అని నాతలఁపు. కాని, నా మనస్సును నేను చూచుకొన్నతరువాత నేనే మిథ్యాచారుఁడనని తెలిసికొంటిని. పెద్దలను గౌరవింపరనునది మఱియొకటి—ఎంతవారినైనను ‘నీవు నీవు’ అని వేయుదురు; విశేషించి పిల్లాపీచూ లేని నన్ను కూడాను. ఇప్పుడు దుర్గ నన్ను ‘ఏమండీ’ అని పిలుచుచో ‘ఏమిరా’ అయిపోయినది.

ఇటీవల ప్రతిదినము ప్రక్క-ప్రక్కల పటహధ్వనులలో మెలఁగుట నాకు అలవాటు కాఁజొచ్చినది. క్రమక్రమముగా నాయెదుట నే తప్పెటలూ తాళములూ.‘నిగ్రహఃకింకరిష్యతి?’

సమయమునకు దుర్గ రానిచో ఇపుడు నేనే పిలుచుచుంటిని.

ఒకనాఁడు తండ్రి చూచుచున్నాఁడని కాఁబోలు నాచేయి పట్టుకొని నాతో వచ్చుచున్న దుర్గ నాచేయి నలిగిన పూవువలె వదిలివైచి ప్రక్కసందులోనికి తప్పుకొన్నది. మరొకనాడు ‘ఒకనాఁడు చూచినాఁడు కదా!’ అని కాఁబోలును చేయిమాత్రము వదిలి నాతో వచ్చినది. ఇంకొకనాఁడు తండ్రి చూపులతోఁ గంటకిత యయినను నాచేయి వదలకయే నాతో వచ్చినది. నేను కాఫీ పుచ్చుకొనుటకు కూరుచుంటిని. దుర్గ దూరముగా నిలువఁబడి అదే పనిగా చూచుచున్నది. అల్లరిపిల్ల చేతిలో గిన్నెను ఎగురఁగొట్టునేమో యని భద్రముగా పట్టుకొని యుంటిని. దుర్గ ‘అదేమిటి?’ అని అడిగినది. ‘కాఫీ’ అంటిని ‘కాఫీ రాసుకుంటారుగాని తాగుతారా?’ అన్నది. ఇది ‘తాగే కాఫీ’ అని ఉదాహరణము చేసి చూపించుచుంటిని. దుర్గ మరికొంచెము దూరము జరిగి నిలువఁబడినది. అడుగునా? యని కనిపెట్టుకొని కూర్చుంటిని. ఊరక చూచును కాని అడుగదు.

‘కొంచెము కాఫీ పుచ్చుకొందువా?’ అని నేనే అడిగితిని. పిల్లల భాషలో ‘అదేమిటి?’ అనుదానికి ‘అది కావలయును’ అను అర్థము నాకపుడు గోచరించినది. గిన్నె చేతి కందించితిని. ‘నాన్న కోపంచేస్తాఁడేమో’అన్నదిదుర్గ.

నాకు కొంచెము ఆలోచనకు అవకాశము. “పరాయివాళ్లము కాఁబట్టికదా ఈపిల్ల సమేతూ ఇటులు అనుచున్న”దని నాకు అపుడు విషాదము కలిగినది. నన్ను అర్థము చేసికొన్నది కాఁబోలు! మేనక నాకన్నులకేసి చూచినది. మేనక మనస్సు నాకు తెలిసినది నామనస్సు మేనకకు తెలిసినది. మన స్సంతయు ఒకటే జాతి. మేనక కన్నీళ్లతో పెరటిలోనికి వెళ్లినది.

దుర్గ చేతిలో గిన్నె ఆరీతినే ఉన్నది. ‘ఇక్కడికి వచ్చావని మీ నాన్న కెట్లా తెలుస్తుంది లే!’ అన్నాను నేను.’ ‘ఆళ్లింటికి ఎందు కెళ్లావ్’ అని నిన్న అడగ లా?’ అన్నది దుర్గ.

నాకు కొంచెము ఆలోచన అంకురించి నది కాని ఇట్టే తుంపివైచితిని.



“నన్ను అర్థముచేసికొన్నది కాఁబోలు! మేనక నాకన్నుల కేసిచూచినది”

'కాఫీ చల్లారితే బావుండదు. తరువాత ఆసంగతి ఆలోచిద్దాం. ముందర కాఫీ తాగు!' అన్నాను. నిజమే ననుకుంటూ కాఫీ గిన్నె ఒక్కసారే ఎత్తి నోటిలో పోసికొన్నది. కాఫీ ముక్కులలో నిండఁగా కన్నులలో కొంత, కన్నులు నిండఁగా చెవులలో కొంత సర్దుకొన్నది 'Economy' తెలిసినట్లు. దుర్గ ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి అయినది. మేనక చరాలున వచ్చి దుర్గను ఎత్తుకొని దగ్గించి తుమ్మించి తానుగూడ కొంత గడబిడ ఆరోపించుకొన్నది. దగ్గులు తుమ్ములు అయినతరువాత దుర్గ— 'నా కిఁక కాఫీ అక్కఱ లేదు. కాని నీకే యిత్తా మాయింటికి రా!' అన్నది.

ఆమఱునటినాఁడు దుర్గ రాకపోవఁగా చాలసేపెదురు చూచితిని. చూచి చూచి వారి యింటికే వెళ్లితిని. దుర్గ తండ్రి వాకిట కూర్చుండి యున్నాఁడు.

ఒక మనుష్యుడు మరియొక మనుష్యుని చూచినంతమాత్రమున మాటాడవలసిన విధి యెచటను లేదు కాని ఎదురుగా కూర్చుండి ముఖము కేసిచూచుచుండుచో అతఁడు వెనుజూపు పెట్టునేని ఇఁక మాటలాడుట యెట్లు? పాఱిపోవు కోయిలను వెంటాడి పలుకరింతుము; ఎదురుగా నున్నను అప్రసన్నునితో మాటలాడఁ జాలము. సహస్రకంఠములతో శబ్దించు సాగరమును తీరమున నిలిచి పిలిచితి మేని 'ఓ' యనును. అక్కఱ లేనిదే అతి గభీరముగ కూర్చున్న మానవునితో మాటాడఁ గలుగుట అరిది.

నేనొక వాత్సల్యదైవమును అతని దేవాలయమున చూడఁదలఁచికొని వెళ్లితిని. కాని తలుపులు తాళాలు పెట్టఁబడెను.

నేనేమెల్లగా తలుపు తెఱచికొన ప్రయత్నించితిని. ఏనుఁగు బలముతోఁగాని ఆతలుపు కొంచెమేని కదలలేదు.

నా చెప్పిన దెల్లయు ఆలించి ఆయన అనెను—'మాఅమ్మాయి అసలే కొండకాటి గాఁడుపిట్ట! మీరు దానిని మరి కొంచెము వాగించుచున్నారు! ఇది అతి పరిచయ మను కొందును' అని

నాయంత నేను త్రోసిన తలుపు బఱ్ఱుమని నామీఁదనే పడినది. నా వేదాంతమపుడు నాకు లెస్సగా ఉపయోగించినది. గతవిషయమఖిలము మేనకతో చెప్పికొంటిని. నా విషాదముకూడ అది అనుభవించినది.

ఇదివఱకు మాయింటికి అలంకారప్రాయముగా ఉన్న మౌనము ఇపుడు భీకరముగా ఉన్నది. ఇపుడు మాయింట నందికేశ్వరుఁడు పటహములు వాయింపఁడు. భృంగి హాస్యములుచ్చెప్పఁడు. కౌమారి ముద్దుమాటలు అనదు. దుర్గ నర్తింపదు. ఇల్లిపుడు గొడ్డువోయినది.

మఱల ఎప్పటి ఆట. నా వేదాంతములూ నేనూ. కొన్ని మాసములు కడచన్నవి. మేనక 'మాదుర్గ తపస్సు చేసికొనుచున్న' దని కలవరించెడిది.

మావీథిలో పేరంటము. ఇపుడు పొరుగింటికికూడ అడుగు పెట్టని మేనక పిలువని పేరంటమునకు వెళ్లినది. మంగళధ్వనులతో చెవులు చిల్లులు వోయినవి. నాకు దుర్గ గుఱుతు తగిలినది. వెంటనే ప్రాఁతకోఁతలు కట్టిపెట్టి దుర్గను తలపోసికొనుచుంటిని. 'పేరంటమునకు వెళ్లుచో దుర్గ కనఁబడునుగదా' అని అనుకొంటిని. నాకు స్త్రీలమీఁదఁ గొంచెము చులుకఁదనము. ఇపుడు పోయినది. ఇంట నే నొక్కఁడనే. నామనస్సున ఒక్క దుర్గయే. ఈదుర్గ వెనుకటి దుర్గ కాదు. ఒక కోరచూపు బెత్తముచే నా బాహుపంజరములోనికి వచ్చుటకు భయపడు దుర్గ.

కొంతసేపటికి నాగది తలుపులమీఁద ఒక మృదుస్పర్శ కలిగినది. నాహృదయపద్మము మీఁద ఒక ఆశాభృంగము వాలినది 'బాబాయ్' అని పిలుపు. నా ఒడలు గగురుపొడిచెను.

మఱల బాబా అని పిలుపు నేను మాటాడలేదు. దుర్గ బిగ్గఱగా అఱచినది వెఱ్ఱి కేకలు వేసినది. పేరంటమునకు వెళ్లక పొరుగున నెవరేని ఉన్నయెడల 'లోపల ఉన్నవాఁడు ఏకారణముననో ఈపాటికి అయిపోయి ఉండునని తలుపుల ఉకకలు ఎత్తి పాఱవైచి యుందురు దుర్గ పిల్ల యగుటచే లోపల నేను గట్టిగా బ్రదికి ఉన్నాననియే, తనను పరీక్షించుటకో నిషేధించుటకో తలుపు తీయలేదనియే.

నేను మాత్రము తలుపు తీయలేదు. పర్వతరాజ శాస్త్రులుగారూ! అని ఋషభ స్వరములో; పర్వతరాజుగారూ! అని గాంధారములో; పర్వతాలూ! అని మధ్యమములో; రాజూ! అని పంచమములో; పర్వతరాజూ! అని ధైవతములో; బాబా! అని నిషాదములో; ఈస్వరము లన్నియు నామనోద్వారమును తెఱచెనుగాని తలుపు తెఱవఁబడలేదు.

ఇఁక ఒకటే స్వరము మిగిలినది. అది ప్రేమస్వరమునకు అపరాంగ మయిన రోదన స్వరము ఆస్వరముతో 'కొంచెం తలుపు తెఱవవయ్యా! ఒక్కసారి చూచి పోతానయ్యా! ఎంతోసేపు కూచోనయ్యా!' అన్నది దుర్గ.

నాపరీక్ష కడ ముట్టినది. నూటికి నూఱు మార్కులు వేసితిని. ఇంతకు ముందే మేనక దొడ్డిదారిని లోనికి వచ్చి ఇదియంతయు ఆలకించుట నే నెఱుఁగను.

మెల్లగా గడియ తీసితిని. నేను ఏమాత్రము భద్రముగా నిలుచుండకపోయినను తలుపులు రెండూ నామీఁద విసురుగా పడునవే. దుర్గ ఎగిరి ఒక్కసారి నాకంఠము కౌఁగిలించుకొన్నది అది తనంతట తాను నాకు దత్తు అయినట్లు. ఆహా! సంతానవంతు లెంత భాగ్యవంతులో! నా కపుడు ఒకానొక ఆనందము కన్నులలో బాష్పధారలుగా పరివర్తిత మయినది. కంఠమున వెక్కులుగా పరిణమించినది. నన్ను చూచి దుర్గ ఆవురు మన్నది.

మాకన్నీరు ఆఁపుటకు కాఁబోలును మాముందు దుర్గ తండ్రి నిలువఁబడి యుండెను.



దుర్గ ఒకతూరి వెనుదిరిగి చూచెను.

తోడిమె ఊడినపూవు. నాసందిటనుండి మధుబిందువువలె నేలకు జాఱెను.

నేను దుర్గతండ్రి కేసి కోరచూపులు చూచుచు నిలువఁబడితిని. దుర్గ శిక్షిత హరిణివలె ముందులకు నడచెను; తండ్రి వెనుకముఖరమయిన వీణ గవుసెనలో నడిచి పోయెను.

మేనకకు నాకును కొన్నాళ్లు వెన్నెల లేదు. మా కేదో తప్పుచేసినటు లుండెను. మఱచిపోయిన మృతమానమును మా యిల్లు క్రమ్మఱ అలవఱిచికొనెను.

పదినాళ్లు పదఁపడి మాయావేదాంతము మాని భక్తివేదాంతములు చదివితిని. అన్ని దేశములవారి భక్తిని తరిచితిని. భక్తి భరతఖండము సొమ్మే.

తొల్లి అన్నిటికంటె జ్ఞానమే ప్రధానమని నావాదము. ఇపుడు ఆస్థానమును భక్తి ఆక్రమించినది. పండితులతో వాదించుటకుఁ గాదు- సాధనకు. వాదింపఁదలఁచినచో—తదేవ కర్మజ్ఞాని యోగిభ్య ఆధిక్య శబ్దాత్ [౧ అధ్యా- ౨ ఆహ్నిక- ౨౨ సూత్ర] అను శాండిల్యుని భక్తిమీమాంసలో పండితులకు రంగస్థలము దొరుకును.

భక్తిలో పడితిని. ప్రతిబిచ్చగానిపాటలోను కవిత్వమే. వ్యాకరణాది దోషములు పాపములవలె మనస్సునకు తట్టుట లేదు. సంగీత సామగ్రితో పనిలేదు. భక్తిరసముకల ఆపాట సర్వాంగ సుందరము.

తెల్లవారుజామున మాయంటి ప్రక్క-పూర్ణమ్మగారు మీరాబాయిపాట తెలుఁగున పాడుచున్నది—

కృష్ణమ్మా! గోపాలబాలా! కృష్ణమ్మా!
కాళ్లాకు గజ్జెలు గట్టి
వేళ్లా కుంగ్రాలు వెట్టి
గోళ్లాకు ఎఱుపులు తిరుగ—
గోరింతాకు పెట్టెద రార-కృష్ణమ్మా!

ఈపాట వినుటతోడనే శ్రీకృష్ణుని మీరాబాయి దత్తు చేసికొన్న దని తోఁచినది. ఆమఱునాఁడు వంగీయుల దుర్గాపూజ చదివితిని వారు దుర్గను కూతురుగా తమ పుట్టింటికి తెచ్చి పూజించికొందురు ఓ! ఎట్టి భావన!

నేను బంగారము కొని తెచ్చి మేనకకు ఇచ్చితిని. మేనక దుర్గా ప్రతిమ చేయించెను. నేను అలంకారములు చేయించితిని.

ఇపుడు అనునిమిషము మాద త్తకుమారి మమ్ము వదలినను మేము వదలము. ఇంకొక తమాషా. నానియమములన్నియు ఇపుడు తలక్రిందు లయినవి. ఇపుడు నేను మా దుర్గను 'ఏడువవేమి' అని అందును 'అది పెట్టు; ఇది పెట్టు' అని అడుగవేమి? అని యేడ్తును. నా కాకితములు చింపవేమి? ఇల్లంతయు మోఁగి పోవునటుల నృత్యము చేయవేమి? అని బతిమాలుకొందును. నీవు పలికినదాఁక అన్నము తిన నని పట్టువట్టి ముక్కు-మూసికొని కూరుచుండుచుందును.